# 11. అతను : ఆమె : ఈమె

**అతను :-**

పగలంతా క్రూరంగా పొగలు సెగలు గ్రక్కిన సూర్యుడు క్రమంగా అస్తమిస్తూన్న సమయంలో చలపతి కాళ్ళీడ్చుకుంటూ బీచి వొడ్డుకు జేరాడు. చల్లని సమయంలో రకరకాల జనం ఆనందంగా వాతావరణాన్ని అనుభవిస్తున్నారు. పిల్లలు ఇసుకలో పిచ్చికగూళ్ళు కడుతున్నారు; యువతీ యువకులు తియ్యని మాటలాడుకుంటున్నారు. ఒంటరిగాళ్ళు వీళ్ళందరి ఆనందాన్ని చూస్తూ, రేడియో సంగీతం వింటూ, ఆ అనుభవాలన్నీ తమవేనన్నట్లు ముఖకళల్లో తృప్తిని సూచిస్తున్నారు. ఇంకొందరు సముద్రపు ఒడ్డున నిలబడి ఉవ్వెత్తుగావచ్చే కెరటాల్ని ఆహ్వానిస్తూ, వాటి తాకిడికి పులకరిస్తున్నారు; ఉండివుండి ఒకో పెద్ద కెరటం వారి దుస్తుల్ని తాకుతూ అరికాళ్ళల్లో చక్కలిగిలి పెట్టి పారిపోతోంది. పట్టణంలోని యీ భాగాన్ని చూస్తే విచారానికి ఇక్కడ తావులేదనిపిస్తుంది.

కాని యీ దృశ్యాలేవీ తనను ఆకర్షించటం లేదు. తన హృదయంలో కరుడుకట్టిన వేదన, దుఃఖం, బాధ మొదలైనవాటిని చీల్చుకొని వెళ్ళగలిగే శక్తి సముద్రపు గాలికి లేనట్లే వుంది. ఐతే మిగతావాళ్ళవలె వాతావరణాన్ని అనుభవిద్దామనే ఆశతో తానాప్రదేశానికి రాలేదు. యీ సముద్రం తన ఒడ్డుకు వచ్చిన వాళ్లకు తాత్కాలిక మనశ్శాంతిని ఇవ్వగలుగుతోంది; తనకు శాశ్వత మనశ్శాంతి యీ సముద్ర గర్భంలో దొరుకుతుందనే ఆశతోనే ఇక్కడికి వచ్చాడు.

మనుషులులేని మారుమూలలకు పోయి పొద్దునే ఒంటరిగా కూర్చున్నాడు. దూరాన సముద్రస్నానం చెయ్యబొయ్యే ఎర్రని సూర్యబింబం. తాటి ఎత్తున లేచే కెరటాలకు తాళాంగా పైకిలేచి చప్పున క్రిందికి వెళ్లిపొయ్యే చిన్న డింగీలు; చేపల్ని పట్టేవాళ్ళు వలలు వేయటం, లాగటం. వాళ్లు స్పష్టంగా కనిపించకపోయినా వారి తాలూకు చీకటి నీడలు మాత్రం అందంగా కనిపిస్తూన్నవి.

తన జీవితంవలె వుందీ సముద్రం! ఎటుచూసినా పొద్దుతగలదు- యీ సముద్ర కెరటాల్లాగే కష్టాలు అలలు అలలుగా తనను ఎదుర్కొన్నవి. దూరానవున్న పర్వతాన్ని కోసివేసినట్లే జీవిత సాగరం తనను ఒక ప్రక్కనుంచి తినేసింది. ఏమైతేనేం త్వరలోనే తాను శాశ్వతంగా యీ బాధలనుంచి విముక్తి పొందబోతున్నాడు.

కాని చావబోయేముందు జీవిత సింహావలోకనంనుంచి తప్పించుకునేందుకు వ్యర్థ ప్రయత్నమే జరిగింది. ఆ సంఘటనల్ని గుర్తు తెచ్చుకున్నంత మాత్రాన తనకు నిరుత్సాహం కలగదు; పైపెచ్చు ఉత్సాహమే కలుగుతుంది. జీవితం మధురంగా వుండే వాడికి చావంటే భయంకాని, కష్టభూయిష్టమైన జీవితాన్ని గడిపే వాడికి మృత్యుదేవత చిరునవ్వుతో ప్రత్యేక ఆహ్వానాన్ని ఇస్తుంది.

తీరా చేయదలుచుకున్న అఘాయిత్యం చేసేశాక విచారించేందు కన్నా పోయిన ప్రాణం తిరిగి రాదుకదా! ఐనా ఇంకా ఏం ఆశలు మిగిలినవని తను తిరిగి ఇంటికి వెళ్ళగలడు? భార్యనూ, ముగ్గురు పిల్లల్నీ వదిలి ఏ కొద్ది సంపాదనైనా ఒక్కపూట తిండికి సరిపోయేపాటన్నా సంపాదించలేక, రెండు రోజులుగా రోడ్లన్నీ తిరిగి, అలసిపొయ్యాడేకాని, యీ ప్రపంచమంతా తనకు చేరెడు గింజలివ్వలేని అసమర్థతనే ప్రకటించింది. తనెందుకూ పనికిరాని వాడా? చదువు సంధ్యలు లేనివాడా? అయ్యో-తనకన్నా హీనులెంతో మంది సుఖంగా బ్రతకగలుగుతున్నారు... కాని, తను నిర్భాగ్యుని వలె, అసమర్థునివలె, నిష్ప్రయోజకునివలె జీవిత పోరాటంలో ఓడి మరి నిలువలేక తన ఓటమిని అందరికీ తెలియజేసేందుకు సిద్ధమౌతున్నాడు.

ఏ ముఖం పెట్టుకొని తను ఇంటికి వెళ్ళగలడు? జబ్బుతో వున్న చిన్న పిల్ల రాత్రే చనిపోయివుండొచ్చు. దాన్నిగూర్చిన విచారం తనకు లేదు. కాని ఇంటికెళ్తే ఆ శవాన్ని దాటించే శక్తన్నా తనకులేదు. కుటుంబీకులకు లేకుండా తను తిని సుఖపడ్డది మాత్రమేముంది కనుక - కల్మషాత్మతో బాధ పడేందుకు? వాళ్లను సుఖపెట్టలేకున్నా, తిండి లేకుండా చావకుండా కాపాడాల్సిన బాధ్యత తనకు లేదని కాదు, కాని ఎంత ప్రయత్నించినా ఆ బాధ్యతల్ని నిర్వర్తించలేనప్పుడు మరి దారేమిటి?

తనకు అప్పులిచ్చిన వాళ్ళంతా పరాభవించారు. అంతతో వాళ్ళ కసి తీరక బెదిరించారు. తన తప్పు వుంది కనుక వాటన్నిటినీ భరించాడు. పరాభవించబడిన ఆ గాయంతోనే మరికొన్నాళ్ళు బ్రతకగలుగుతే కొంత ఓదార్పు వుండేది.... కాని తన

భార్య కూడా తనను పరాభవించింది. తన నిష్ప్రయోజకత్వానికి మొహంలో నవ్వింది. సంపాదించలేనివాణ్ణి చూస్తే స్త్రీకి నవ్వులాట సహజమే! అందులోనూ జీవితమంతా పోషిస్తానని హామీనిచ్చి చేసుకున్న భార్యను, కన్నబిడ్డల్నీ పోషించటం కనీస బాధ్యత. ఆ హామీ ఇచ్చిననాడు తనకు యీ రకం వొత్తిడి వొస్తుందనీ; హీనాతి హీనంగా దిగజారిపోయే పరిస్థితులు ఎదురవుతవనీ వూహించనైనా లేదు. తీరా ఆ పరిస్థితు లెదురయ్యాక చేతులెత్తటం తప్పలేదు.

ఛీ – యీ బతుకు బతకటంకంటే చావటం వెయ్యిరెట్లు నయం. అప్పుడెవరన్నా తనపట్ల సానుభూతి చూపి, కనీసం మనసులోనైనా మెచ్చుకునే వాళ్ళుంటే – ఐనా తన శవానికి యీ ప్రపంచంలోని అభిప్రాయాలతో పనేమిటి? ... తన కుటుంబానికి మరింత హాని జరిగినా, మేలు జరిగినా తన బాధ్యత ఉండదు. వాటన్నిటినీ తెంచుకొని తను అతీతుడవబోతున్నాడు.

తనలాటి నిర్భాగ్యులకెందరికో దమ్మిడీ ఖర్చు లేకుండా హోరు పెడుతూ యీ సముద్రం స్వాగత గీతాలు పాడి ఆహ్వానించింది; ఇవాళ ఆహ్వానితుల్లో తనూ వొకడవుతున్నాడు. చావును గూర్చి ఆలోచిస్తే నిజానికి గుండె నీరవాల్సిందే కాని, ఇదీ వొక సాధారణ సంఘటనలాగే తోచింది తనకు. మెదడు బండబారటం వల్ల ఉద్రేకాలూ, ఉద్వేగాలూ సరిగా తెలియరావటం లేదు.

తనను ఎరిగిన వాళ్ళందరూ అసహ్యించుకున్నారు; తన మీద తనకే అసహ్యం కలిగి, దాన్ని భరించాక, ఇతరులకు కలిగిన జుగుప్సకు చలించలేని స్థితి తనలో ప్రవేశించి చాలాకాలమైంది. ఆ అసహ్యమే దేహ త్యాగంగా పరిణమించటంతో పూర్తవుతుంది – అంతే!

సూర్యుడు కుంగిపొయ్యాడు. భూమిని ఆవరించిన వెలుగింకా పూర్తిగా మాయమవలేదు. దూరాన రోడ్డుమీద మెర్క్యురీ లైట్లు వెలుగుతూన్నవి... మరో అరగంట ఆగుతేనే కాని లాభంలేదు. ఇంకా జనం వున్నారు. పొరపాటున ఎవరైనా తనను రక్షించవచ్చు. అది వారికి ఘనకార్యంగా కనిపించినప్పటికీ, బలవంతాన తనను తిరిగి నరక కూపంలోకి తోసెయ్యటమే అవుతుంది.

దాహమైంది : కాని లేచి వెళ్ళి మంచినీళ్ళు తాగి అందువల్ల కలిగే సుఖాన్ని పొందటం మౌఢ్యమనే అభిప్రాయంతో వూరుకున్నాడు... యీ మనుషులు త్వరగా వెళ్ళిపోతే బాగుండు ననిపించింది... అంతకన్న ఇంకా కాస్త దూరం పైకి వెళ్తే బాగుంటుందేమో?

లేని ఓపికను తెచ్చుకొని, సముద్రపు టొడ్డునే బరువుగా మెల్లిగా నడవసాగాడు. ఒక ఫర్లాంగు పైగా నడిచి వుంటాడు. వెనక్కు తిరిగి చూశాడు. మనుషులు స్పష్టంగా కనిపించటంలేదు. ఇంకాస్సేపు ఆగటమే మంచిది – కాని యీ చివరిక్షణాలు చాలా

తొందరపెడుతూ, ఆతృత కలిగిస్తూన్నవి. నిర్లిప్తంగా గంభీరమైన సాగరంలోకి చూశాడు; ఎన్నో జీవరాశుల్ని పొట్టలో ఇముడ్చుకోగలిన దీనికి, తనెన్నడూ బరువవడు.

నిలబడే శక్తిలేక కూలబడ్డాడు. దాదాపు అతని బుఱ్ఱ పనిచేయటం లేదు. ప్రాణముంది కనుక బతికి వున్నాడనాల్సిందే తప్ప వినేదాన్నీ, చూసేదాన్నీ గ్రహిస్తున్నాడని చెప్పలేము. అందుకనే పేరుపెట్టి నాలుగుసార్లు పిలిచినా, అతను పలుకలేదు; కనీసం మొహమెత్తన్నా చూడలేదు.

ఆమె అంతతో వెనక్కుపోక, ఇంకా దగ్గరికి వచ్చింది. అతని ముఖాన్ని దగ్గర్నుంచి చూసేందుకు ఆమె మోకరించి అతని ముఖంలోకి చూసింది. "చలపతీ!" అని పిలిచింది కూడాను. అప్పటిక్కాని తనలో చలనం కలగలేదు. ఆ స్త్రీ కంఠం వినగానే తన భార్య వెంటపడిందనే భయం కలిగింది. నరకానిక్కూడా ఒంటరిగా పోనీదా? తత్తరపడ్డాడు. ఆమె ఎవరో చూసే సాహసం కూడా లేకపోయింది.

"చలపతీ!... నేను...నేను - నన్ను గుర్తుపట్టలేదా?" అందామె.

కంఠస్వరం ఎక్కడో విన్నదే - తన భార్యమాత్రం కాదు. ఎవరా అని చూశాడు. చూడగానే గుర్తు పట్టగలిగాడు.

"ఎవరూ? సరోజినా!" అన్నాడు వెగటుగా.

ఆమె నవ్వింది; ఆ నవ్వులో సంగీతం ధ్వనించింది.

"ఔను... అబ్బ! జీవితంలో మళ్ళీ నిన్ను కలుసుకునే భాగ్యం వుంటుందనుకోలేదు. ఎంత తమాషాగా కలిశాం!... ఇలా వున్నావేమిటి చలపతీ" అందామె అనురాగం వెల్లివిరిసే కంఠస్వరంతో.

సరోజినిని కలుసుకున్నందుకు ఒక పక్క ఆశ్చర్యం, మరో పక్క క్రమంగా అసహ్యం కూడా రేకెత్తినవి. చూసిన క్షణంలో ఏదో కొత్త ఆశ తాలూకు మెరుపు కళ్ళముందు కదిలింది; కాని వెంటనే మానిన గాయం రేగినట్లయింది. ఒకప్పుడు తన వివాహం యీమెతోనే అవవలసింది. కాని పరిస్థితులు తారుమారై, దావాల్లో వున్న తన ఆస్తి అంతా దాయాదుల పాలవగానే, అలంకరణలు లేని తనుగా మిగిలిపొయ్యాడు. అలాటి తనను యీమె నిరాకరించింది. ఆ అవమానాగ్నితో రెండేండ్లు దహించుకొని పొయ్యాడు. యీమె స్థానాన్ని తనభార్య తీసికొని తనపట్ల ఎంతో సానుభూతిని చూప నారంభించాక, ఆ సంగతులన్నీ మరిచిపో కలిగాడు! సరోజిని మళ్ళీ ఇన్నాళ్ళకు కనిపించి భక్తుడికి ప్రసన్నురాలయే దేవతవలె పలకరించింది. ఏం జవాబు చెప్పాలో తెలియక తను గుడ్లప్పగించి ఆమెను చూడసాగాడు.

ఆమె - గర్వంతో నవ్వుతూ గాలికి రేగే ముంగురుల్ని కూడా సరి చేసుకోకుండా తనను తదేకంగా చూస్తూ తన మాటలకు జవాబు రానందువల్ల "మాట్లాడవేం చలపతీ? యీ బట్టలేమిటీ - యీ ఆకారమేమిటి? ఎంత మారిపొయ్యావ్?" అంది.

తన యీ స్థితిని చెప్పే ఓపిక లేదు. ఇంత తియ్యని మాటలు విని ఎన్నాళ్ళయిందో! దిగజారిపోయిన గుండె యధాస్థానానికి ఎగబాకాలని ప్రయత్నిస్తోంది. మళ్ళీ ఆశలు చిగురిస్తున్నవి.

తను పెద్ద దెబ్బకు గురైవుంటాడనే సంగతి ఆమె గ్రహించినట్లుంది. అతనిచేత మాట్లాడించేందుకు తగిన శక్తిని కల్పిద్దామని, అతన్ని నిమురుతూ, పమిటచెంగుతో ముఖం తుడిచింది. యీ ఆదరణను భరించలేక, ఇన్నాళ్ళుగా హృదయంలో దాచుకున్న వ్యధ మరి నిలవలేక అగ్నిపర్వతం ప్రజ్వరిల్లినట్లు ఒక్కసారిగా బైటికి ఉరికింది. క్షణంలో చిన్న పాపవలె వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. పిల్లవాణ్ని ఊరడించే తల్లివలె - తన తలను వొళ్ళో పెట్టుకొని ఆప్యాయంగా ఓదార్చ సాగిందామె.

"ఎందుకూ?... ఛీ.... ఏడుస్తారా?... నీకేం కష్టం వచ్చిందీ! నేను లేనా?... నాకు చెప్పవా! ... నీకేం భయంలేదు.... నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం..." మొదలైన మాటలనేకం ఆమె నోటినుంచి వెలువడినవి.

బలవంతాన దుఃఖాన్ని ఆపుకున్నాడు. తిరిగి ప్రాపంచిక విషయాలనేకం గుంపుగా మీదకి ఉరికినవి. తను బతకాలి; ఆ ఆధారం దొరుకుతే వొదిలేటంత మూర్ఖుడుకాదు తను; తనతోపాటు తన కుటుంబమూ బతకాలి. అది వీలుకాకుంటే యీ సముద్రం ఎప్పుడూ ఇక్కడే వుంటుంది కనుక, తనకు చిట్టచివరి ప్రక్రియ ఎప్పుడూ అందుబాటులోనే వుంటుంది.

"ఆకలవుతోంది-" అన్నాడు, ఎండిన గొంతును తడి ఆర్చుకుంటూ.

ఆమె వినిపించుకోలేదు. "ఏమైందీ? అంతా చెప్పు-" అంది.

"ఆకలి" అన్నాడు మళ్ళీ.

ఆమె ఆతృతను తగ్గించుకుంది.

"కాస్తదూరం నడవగలవా? మెల్లిగా... నా భుజం మీద చెయ్యి వెయ్యి. సిగ్గుపడుతున్నావా?.. నేను నీ రోజనేగా?... అక్కడ కారువుంది... ఆఁ, అలా..."

మెల్లిగా అతన్ని రోడ్డుమీదికి జేర్చింది. డ్రైవర్ యీ బిచ్చగాణ్ణి చూసి చీదరించుకునేవాడే కాని ఆమె ముఖం చూసి భయపడి వూరుకున్నాడు. మెత్తని సీటులో వాలిపొయ్యాడు. కారు వెళ్తూంటే శోష వచ్చినంత పనైంది. యీ కాస్సేపటిలోనూ, ప్రాణం పోతుందేమోనన్నంత భయం వేసింది తనకు. శరీరంలో మిగిలిన శక్తులన్నిటినీ కూడదీసుకుని నిలతొక్కుకుంటున్నాడు.

ఆమె ఇంటికి - ఇల్లా అది? - పెద్ద బంగళాకు తీసుకొని వెళ్ళింది. అన్నివైపులనుంచీ లక్ష్మీదేవి నాట్యం కనిపిస్తోంది; వినిపిస్తోంది. ఎన్నాళ్ళయిందో కలలోనన్నా ఇలాటి దృశ్యాల్ని చూసి! చచ్చి స్వర్గానికి వెళ్తే బాగుండు ననిపించేది

ఒకప్పుడు - కాని ఆ స్వర్గమే బతికి వుండగా లభ్యమైతే : దానికోసం చచ్చేందుకు పడే శ్రమకూడా అనవసరం!

"ఆకలి" అన్నాడు మళ్ళీ.

ఆమె వెంటనే వేడికాఫీ ఇచ్చింది. గుటగుటా తాగాడు; శరీరంలో కొంత ఉత్సాహం వచ్చిపడింది. పళ్ళరసం ఇచ్చింది. అదీ తాగాడు. యాపిల్స్ కోసి ఇచ్చింది. తిన్నాడు... ఇవన్నీ అల్పాహారాలుగానే తోచినవి. ఇంకా అడుగుదామంటే మొహమాటం అడ్డుపడింది.

"భోజనం చేద్దువుకాని, మరో పావుగంట ఆగు. ముందు స్నానం చెయ్యి - ప్రాణానికి హాయిగా వుంటుంది. రా...." అని అతన్ని బలవంతాన లాక్కువెళ్ళి బాత్‌రూంలోకి నెట్టింది. కింద నేలలో తన పాప వెక్కిరిస్తోంది. కాదు - గర్వంగా తనూ ప్రయోజకుడవుతూన్న ఠీవితో నవ్వుతోంది. షవర్ వొదిలి అలసిన శరీరాన్ని దాని కిందకి తోశాడు. ఎంత హాయిగా వుంది? ఘుమ ఘుమలాడే సబ్బువాసనలు, పాత వాసనల్ని హరించుకున్నవి. శరీరం నుంచి వెలువడే సుగంధానికి మూర్ఛ పర్యంతమయింది.

మెల్లిగా బైటికి వచ్చాడు. తన దుస్తులు ఎక్కడున్నవో చూసుకోవాలి. ఆమె ఎదురుగా ఇస్త్రీ బట్టలతో ప్రత్యక్షమైంది. సిగ్గుపడుతూనే ఆ బట్టలు అందుకొని ధరించాడు. చొక్కా వదులును బట్టీ, పొడుగునుబట్టీ ఇవి తనకన్న, బాగా వయసుమీరిన వ్యక్తివై ఉంటవని అర్థమైంది. ఆ వ్యక్తి ఆమె భర్తే కావచ్చేమో?

భోజనం దగ్గర ఆమె ప్రసంగించలేదు; చాలునన్నా వూరుకోకుండా పొట్ట పట్టనంతగా తినిపించింది. అందులోనూ రుచికరమైన పదార్థాల మీదికి దాడి వెడలాడు. తీరా భోజనం ముగించాక -- తృప్తిగా తేపినప్పుడు -- తన భార్యాబిడ్డలు ఆకలితో మల మలా మాడుతున్న సంగతిగుర్తొచ్చి, వికారం కలిగించింది. ఛీ - అని తనను తాను అసహ్యించుకున్నాడు. తను కృతఘ్నుడు... తన బాధ్యతల్ని మైమరచి చేతికి అందింది కదానని దొరికిన సౌఖ్యాన్ని స్వార్థంతో తానొక్కడే అనుభవించి కుటుంబీకులందరికీ అన్యాయం చేశాడు.

ఇంటికి వెళ్ళాలనే ఆతృత ఎక్కువైంది. కాని వొట్టిచేతుల్తో వెళ్ళటం అసంభవం. తన నోటినుంచి ఏమి ఆజ్ఞ వెలువడుతుందోననే ఆతృతతో ఆమె పక్కనే నిలబడివుంది. కాని ఎంతచెడ్డా తనూ మూతిమీద మీసం వున్న మొగాడేనాయె! బతికిచెడినవాడు కావటం వల్ల పాత వాసనలు ఇంకా వొదలలేదు. ఆమెను ఏమైనా కోరేందుకు ఆత్మాభిమానం అడ్డుపడుతోంది.

"ఎలా వుందిప్పుడు?" అందామె.

దీనంగా ఆమె వైపు చూశాడు.

"ఏంకావాలీ? అసలు ఏమైందీ? మనం కలుసుకొని.. ఎనిమిదేళ్ళయింది... యీ మధ్యలో జరిగిన గాథల్ని ఒకళ్ళ కొకళ్లు వినిపించుకోవాలి కదూ?..."

"ఇప్పుడు కాదు. రేపు తీరిగ్గా మాట్లాడుకుందాం. ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి" అన్నాడు.

"ఇంటికా?" అని ఆపైన వూరుకుందామె. ఇల్లనగానే సంసారం, భార్య, పిల్లలూ ఉండి వుంటారనే ఊహతో ఆమె ఆగిపోయింది.

"ఇప్పుడే వెళ్లాలా?"

"ఇప్పుడే.. మళ్ళీ రేపు కలుద్దాం."

ఆ కంఠస్వరంలోని ఆతృతకు ఆమె అడ్డు చెప్పలేకపోయింది.

"కారు పిలిచేదా!"

"నాకు... డబ్బు కావాలి" అన్నాడు నేలచూపుల్తో, ఆ గొంతులో అడుక్కునే వాడి దైన్యం లేదు. హక్కును అమలు జరిపేవాడి కంఠస్వరమిది.

నవ్విందామె ... ఎగతాళిగానో, సాధారణ విషయాన్ని అసాధారణంగా గుర్తించినందుకో.. అతనికేమీ అర్థం కాలేదు. నిరాకరిస్తుందేమోనని భయం కూడా వేసింది. మరుక్షణంలోనే ఆమె లేచి వెళ్ళి బీరువా తెరచి కరెన్సీ నోట్లకట్ట నొకదాన్ని నిర్లక్ష్యంగా అతని మీదికి విసిరివేసింది. పదులబొత్తి.... వెయ్యి రూపాయలు! తన బతుక్కి సంవత్సరంపాటు సరిపోతవి. ఆ ఆనందంలో అతనికి మతిపోయినట్లయింది. ఆమె కాళ్ళమీద పడాలనుకున్నాడు. కాని తన విలువనూ, వ్యక్తిత్వాన్నీ నీచపరచుకోవట మౌతుందని ఎలాగో నిలవతొక్కుకున్నాడు.

"రేపు ఎప్పుడొస్తావ్!" అన్నదామె అధికారంతో.

"ఎప్పుడు వీలో?"

"ఉదయం పదకొండింటికిరా... ఇక్కడే భోంచేద్దువికాని. కారు పంపుతానులే." సరేనన్నట్లు తలతిప్పాడు తను.

అతన్ని కారులో కూర్చోబెట్టి సాగనంపి, బరువుగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళిందామె.

* * *

**ఆమె :-**

యవ్వనంలో అందరివలెనే తనూ ప్రేమించింది. ముందుగానే అన్నీ ఆలోచించి చలపతినే ప్రేమించేందుకు తగిన కారణాలున్నవి. రూపవంతుడు, యువకుడు, ధనవంతుడూ, తెలివిగలవాడూను - అంతకన్న కోరదగిందేమిటి?

మరో ఆరునెల్లకు వివాహ మాడదామనుకుంటూండగా చలపతి తాలూకు ఆస్తిపాస్తులన్నీ పోయినవి. ధనవంతుడనుకున్న చలపతి కడు బీదల్లోకి జారిపొయ్యాడు. చలపతిని చలపతిగానే ప్రేమించగలగటం సాధ్యమే నేమోకాని, వొఠ్ఠి ప్రేమతో బతకటం దుర్లభమని తెలుసుకోలేని అశక్తురాలు కాదు తాను! భార్యకు భర్త సంపదే దిక్కు కనుక, తెలివిగా చలపతిని తప్పించుకుంది. చలపతి ఒక పట్టాన వొదలలేదు. చదువుకే డబ్బులేక మానుకుంటూ తనను పెళ్ళాడ దలచటం వృథా ప్రయాస అనీ, మౌఢ్యమేననీ నచ్చ చెప్పాలని చూసింది. కాని అతను ఆదర్శంమీదా అభ్యుదయ దృక్పథం మీదా, ఆత్మ సౌందర్యం మీదా ఉపన్యాసాలు దంచటం మొదలు పెట్టినప్పుడు, నిత్యజీవిత విధానాన్ని అర్థం చేసుకోలేని అతని అమాయకత్వానికి నవ్వి, తన అసహ్యాన్ని ప్రకటించి ఒక రకంగా పరాభవించి కూడా పంపేసింది.

యీ ప్రణయ గాథవల్ల తాను తలకిందులైతే అవలేదు. కాని కొంత వరకూ మనశ్శాంతి చెడినమాట నిజం. ఐతే కోల్పోయిన మనశ్శాంతిని త్వరలోనే తను తిరిగి సంపాయించ గలిగింది. అన్ని విధాలా అనుకూలంగా వుండే సంబంధం కథల్లో తప్ప ఉండదనే సంగతి గ్రహించగలిగింది. ఏమైతే నేం - విలాసజీవితానికి అలవడ్డాక, డబ్బు తక్కువవున్న మొగుణ్ణి తెచ్చుకునేటంత తెలివితక్కువది కాదు తాను. అందుకనే రెండోపెళ్ళి వాడైనా లక్షలు మూలుగుతూండే వ్యాపారినే పెళ్ళాడింది. తనను ఎరిగిన వాళ్ళందరికీ యీ సంబంధాన్ని తాను వొప్పుకోవటం ఆశ్చర్యంగానే వుంది. కాని, నిజానికి తనపట్ల ఎంతమంది స్నేహితురాండ్రు యీర్ష్యపడ్డారో తనకు తెలుసు. డబ్బు లేకుంటే బతికే హక్కన్నా లేని కాలంలో, కలకాలం సుఖపడేందుకు తాను తెలివిగా వలవేసి గెలుచుకుంది.

కాపరానికి వొచ్చినప్పటినుంచీ, దాంపత్యం అనుకూలంగా లేదు. ఉంటుందని తను అనుకున్నది కనుకనా? వయసు ముదిరిన భర్త మీద అన్ని అధికారాలూ చలాయించగలదు. తన దయ సంపాయించేందుకు అతను వేసే ఎత్తులు, తన అడుగులకు మడుగులొత్తటం అవన్నీ చూసి నవ్వుకునేది.

ఆ ఇంటికి తనే అధికారిణి. ఆ లక్షలన్నీ తన ఆధీనంలోవే! ఒక పక్క భర్తను అసహ్యించుకుంటూనే మరోపక్క అతని ఐశ్వర్యాన్ని అనుభవించటం నేర్చుకుంది. "అవ్వా కావాలి - బువ్వా కావాలి" అనే మొండి పట్టుదల లేనందువల్ల, తన లోకంలో తానే విహరించటం నేర్చుకుంది.

కాని యవ్వనం ప్రశాంతినిచ్చేదికాదు. ఎప్పుడూ వ్యాపారం మీదనే సకల శక్తుల్నీ కేంద్రీకరించుకున్న భర్తతో దాంపత్య సౌఖ్యం ఎండమావుగానే వుంది. అతని మీద చిర్రుబుర్రు లాడటం తప్ప తాను చేయగలిగిందేమీ లేదు. తన మీద ఎంత ప్రేమ, అభిమానం వున్నా మరో పక్క "నేను నిన్ను కొన్నాను. పడివుండు!" అనే నిర్లక్ష్య భావం కూడా ఆ భర్త వ్యక్తపరుస్తూంటాడు. ఆ భావాన్ని స్పష్టీకరించటం, ప్రమాదాన్ని కొని తెచ్చుకోవటమే కనుక తనూ భరించి వూరుకుంది.

కావలసినంత ధనం! కోరినంత స్వాతంత్ర్యం! యీ రెండూ జీవిని సుఖ పెట్టగలవని ఒకనాడు అనుకోవటం పొరపాటే ననిపించింది. కాని తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం నిష్ప్రయోజనం... కాని కాలినచేతులకు చికిత్స చేసుకోవటం అవసరమే.

చలపతి జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా తన హృదయం క్షోభిస్తూండేది. అతను హృదయ పూర్వకంగా తనను ప్రేమించాడు. ఆ ప్రేమను తనకు ఇష్టమైన విధానాల్లో వ్యక్తీకరించాడు. ఆ స్వర్గసుఖం తాలూకు జ్ఞాపకాలు మాత్రమే ఇప్పుడు మిగిలినవి. మళ్ళీ ఎప్పుడన్నా చలపతి కనిపిస్తే....!

అతను కనిపిస్తే జరిగే కథను తాను ఊహించుకునేది. తన నాయకుని రంజింపచేయటం, తమ మధ్య సంభాషణలు - మొదలైన వాటిని గూర్చి గంటల తరబడి కలలు కనేది. కొంతవరకూ యీ కలలు మానసికానందాన్ని ఇచ్చేవి. క్రమంగా ఇలా జరుగుతుందనే ఆశ కూడా ఆమెలో సన్నగిల్లింది. నిజంగా అతన్ని కలుసుకో గలిగేవరకూ, ఆ వూహ వస్తే తన తెలివితక్కువకు నవ్వుకొనేది.

ఆరాధకుడు లేనిలోటు, తనకు నచ్చినవాడు, కామదృష్టితో చూడగలిగే వాడికోసం నిజంగానే తన హృదయం తపించిపోసాగింది. ఇదే తన భర్త నుంచి పొందగలుగుతే ప్రపంచంలో తనంత సుఖపడే జీవి మరి లేదనే గర్వం కలిగివుండేది. ఐతే ఇతర యువకులు కొంతమంది తన కోసం ప్రయత్నించి నప్పటికీ, తాను మహా నీతిపరురాలివలె, ఇహలోక వాంఛలకు అతీతురాలివలెనే తప్పించుకుంది. తప్పించుకో గలిగినందువల్ల కలిగిన గర్వం ఆ అనుభవంవల్ల పొందే సౌఖ్యాన్ని వేరొక రూపంలో తనకు అందించింది.

కాని ఎన్నాళ్ళిట్లా? యీ యవ్వనం ఎల్లకాలం వుండదు. తన నుంచి సౌఖ్యపడి, తనను సౌఖ్య పెట్టగలిగిన జీవికోసం ఏళ్ళ తరబడిగా ఆమె గాలిస్తూనే వుంది. తనకు ఎదురైె తనను కోరినవారందరిపట్లా ఆమెకు కోర్కె కలగకుండటం ఒక విశేషం. పురుషులంటే ఆమె దృష్టిలో ఒక నీచవర్గానికి చెందిన వారుగానే వుండిపొయ్యారు. కారణమల్లా ఆ పురుషులు తను భావించిన స్టాండర్డ్‌కు చాలా తక్కువలో ఉన్నారు. అంత కన్న, చలపతితో పోల్చి చూసుకుని వారందర్నీ నిరాకరించగలిగింది....

అదీగాక భర్తంటే తనకు కలిగిన అసహ్యాన్ని ఎంత ప్రయత్నించినా తగ్గించుకోలేకపోయింది. తనను డబ్బుకు కొన్నాడు; అంతేకాని నిజమైన అర్హత, భర్తపదవి, అందులోనూ తనలాటిదాన్ని ఏలుకునే యోగ్యత అతనికి లేదు. యీ సంగతి ఆ భర్తకు కూడా తెలిసే తన నుంచి నేరం చేసిన వానివలె తప్పించుకుని తిరుగుతూంటాడు. యీ భర్త పట్ల కలిగిన అసహ్యభావమే, తనకు తెలియకుండానే మిగతా పురుషజాతి కంతకూ ఆపాదించబడి ఉండొచ్చు.

ఇలా మథనపడుతూ, గంటల తరబడిగా వ్యథ పడుతూండే సమయంలో ప్రమాదవశాత్తు తనకు చలపతి కనిపించటం, అదృష్టదేవత ప్రత్యక్షమవటమే ననిపించింది. కాని ఆ పాత సంఘటనల్ని మనసులో పెట్టుకొని అతను తనంటే ఇష్టమున్నప్పటికీ, తనను తృణీకరిస్తాడేమోననే బాధ కలిగింది. నిజంగా అలా జరిగితే తనకీ ప్రపంచమే వాసయోగ్యం కాకుండా పొయ్యేది. కాని ఎప్పుడైతే అతను హీనావస్థలో వున్నాడని తెలుసుకో గలిగిందో, అతని డబ్బు అవసరాల్ని తాను తీర్చగలిగే స్థితిలో వున్నదని తెలుసుకో గలిగిందో - అప్పుడే ఆమె ఆశలు ఊడలు దింపుకున్నవి. యీసారి కూడా జయం తనదే! తనకు అతని మీద గొప్ప అధికారం - అది ఏ రూపంలోనైతేనేం చిక్కింది!

చలపతి బలహీనతను అడ్డం పెట్టుకొని తన అభీష్టాల్ని సిద్ధించుకోవటం జరగక తప్పదు. ప్రణయం పెంపొందేందుకు, అభిమానాలు పెరిగేందుకు ఏ కారణం వెనుకవున్నా ప్రమాదంలేదు. నిజానికి చలపతి బలహీనతే, అతన్ని తన వాడుగా చేసుకోగలిగే అవకాశాల్ని చేకూర్చింది. ఇది నీచమనుకునేట్లయితే, ప్రపంచంలోని ప్రతివారూ ఏదో రకంగా యీ బలహీనతల్ని అడ్డం పెట్టుకొనే, మనుషుల్ని తమ పనులకుగాను ఉపయోగించుకుంటున్నారు. సూక్ష్మంగా ఆలోచిస్తే యీ సత్యం సన్నిహితుల మధ్య కూడా గోచరిస్తుంది. పిల్లలు సంపాయించుకోలేని అసమర్థులు కనుకనే, తండ్రి అధికారాన్ని చలాయించ గలుగుతున్నాడు; భార్యకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదు కనుకనే, భర్తకు లొంగిపడివుంది. తగినంత డబ్బు లేనందువల్లనే అనేకులు ఉద్యోగాలు చేసుకుంటూ, అయిష్టంతోనే అధికారుల అడుగులకు మడుగు లొత్తుతున్నారు. ప్రభుత్వం బలమైనది అయ్యేందుకూ నిరంకుశపాలన చేసేందుకూ ప్రజల బలహీనతే కారణం.. తన బలహీనతను ఆధారంగా తీసుకొని, తన భర్త తనను కట్టిపడేసి "భార్య" అనే లేబిల్ అంటించి గర్వపడలా? ఇదే నిత్యజీవిత సత్యాన్ని తను చలపతి పట్లకూడా దిగ్విజయంగా ప్రయోగించింది. యీ దౌర్బల్యాలే మానవుల్లో లేకుంటే లోకం ఏనాడో తలక్రిందులయ్యేది కదా! ప్రణయం మాత్రం ఒక రకం హృదయ దౌర్బల్యం, లేదా శారీరక దౌర్బల్యం; లేదా రెంటి మిళితం కాదా ఏమిటి?

ఇక చలపతి మొదట్లో తన పట్ల విశ్వాసంతో ప్రవర్తిస్తూ, తరువాత తన అభిమానాన్ని పొందేందుకు అనురాగాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఇదంతా నటన అనే

అనుమానం తనకు కలగకపోలేదు. దాన్ని తరచటం అనవసరం... ఏ రూపాన అయితేనేం తన కోర్కెలు తీరుతున్నవి. బజార్లో ధనంతో కొనగలిగే వాటిల్లో ప్రణయంకూడా ఒకటనే సంగతి తాను ఏనాడో గ్రహించింది. నానా అవస్థలూ పడకుండా, ఇంత తేలిగ్గా ప్రణయం అమ్మకానికి దొరికేట్లు చేయగలిగిన యీ నాగరికత, సంస్కారం నిజంగానే మెచ్చుకోదగ్గ వనిపించింది.

మొదట్లో యీ రహస్య సమావేశాలకు భయపడేది తను. కాని క్రమంగా, ఇంతా ఏడుస్తే అది తన జన్మహక్కనీ, తాను న్యాయసమ్మతంగా పొందగలిగేదేననీ సమాధానపరుచుకుంది. అన్నిటికన్నా తనకు భర్తచేసిన అన్యాయానికి ప్రతీకారంగా, తాను ప్రాతివత్యాన్ని తప్పటం కొంతవరకూ ఆత్మశాంతిని కూడా ఇచ్చింది. ఐతే ఎంతగా సరిపెట్టుకోవాలని చూసినా గుండెల్లో ఒక మూల "బితుకు బితుకు" శబ్దం వినవస్తూనే ఉంది. ఇంతకుపూర్వం లేని అనురాగాన్ని భర్తపట్ల నటించేందుకు కూడా ఎంతో ప్రయత్నించింది. కాని అతను యీ ప్రణయాలకు అతీతుడు. ఒకో మనిషి ఒకో రంగంలో అద్వితీయ కౌశలం ప్రదర్శిస్తాడు. తన భర్త వ్యాపారంలో డబ్బు గడించగలగటమే యీ అద్వితీయత.

కాని క్రమంగా తన కామలీలలు భర్తచెవికి తగలకపోలేదు. అయితే ఆ సమయం, ఆ సంఘటనను ఏనాడో ఒకనాడు తను తప్పక ఎదుర్కోవాలనీ, అప్పుడు ఆ భర్త బలహీనతల్ని కడిగేసి, తన పనుల్ని సమర్థించుకోవొచ్చనీ ఏనాడో తను నిర్ణయించుకుంది. చెడుపని చేసేప్పుడు, ఆ చెడును తనకు అనుకూలంగా తిప్పుకో ప్రయత్నించటం అసహజం కాదు.

తమాషా – తాను అనుకున్నట్లేమీ జరగలేదు. భర్తకు తెలిసివుండి కూడా, తెలియనట్లే ఊరుకున్నాడు. అతనికి తెలిసిపోయిందనే విషయం నిర్ధారణగా తేలినప్పుడు కూడా అతని మౌనం తనను ఆశ్చర్యపెట్టింది. ప్రణయానికి అతను ఎంత అతీతుడో, ఈర్ష్యకూ అంతే. తన పనులకు అడ్డం రాని భర్తపట్ల ఆమె జుగుప్సంతా, ఒకరకం జాలిగా మారింది. అతనేదో త్యాగం చేసినట్లు భావించి అతని పట్ల భక్తిభావాన్ని పెంపొందించుకో గలిగింది. ఈ విధంగా రెండు రకాల అనుభూతులకూ తను అలవాటవగలిగింది.

చలపతి – ఆత్మ మినహాగా తనకు దక్కాడనేది గ్రహించకపోలేదు. ఆ ఆత్మను కొనేందుక్కూడా తను విశ్వప్రయత్నం చేసింది. కాని ఫలించలేదు. అంతవరకే దక్కుదలనుకొని తృప్తిపడే జ్ఞానం తనకు వుండబట్టి నిరాశతో కుంగలేదు.

తనకు డబ్బు కావాలన్న రోజు; చలపతి ఎంత అనురాగాన్ని చూపుతాడు! అతని రాకతోనే తానాసంగతి గ్రహించగలదు. అనుకున్నట్లే అతను వెళ్లేటప్పుడు, అధికార స్వరంతోనే డబ్బులు అడుగుతాడు. "ఈరోజు ఇతనికి డబ్బివ్వకూడదు; తగినట్లు

బుద్ధి చెప్పాలి" అనుకుంటుంది తను మొదట్లో. కాని చివరకు, అతన్ని అన్యాయం చెయ్యకూడదనే భావంతో, అంతకన్న మరోసారి అతను రాడేమోననే భయంతో డబ్బు యిచ్చేస్తుంది. డబ్బు పోతోందనే బాధ తనకు లేదుకాని, ఆ డబ్బుకు తగిన ప్రతిఫలాన్ని పొందలేకపోతున్నాననే బాధ మాత్రం మిగిలింది. కాని అంతకన్న చేయగలిగింది కూడా లేదు. ఇంకా లోతులలకు వెళ్తే ఈ వున్న స్నేహం చెడుతుందేమోననే భయంతో తను రోజుల్ని ఇలాగే దొళ్ళనిచ్చింది.

అయితే యీ ఆనందం సంవత్సరం తీరక ముందే పోతుందని ఎన్నడూ అనుకోలేదు. ఈ డబ్బు లంకెతో అతన్ని ఎల్లకాలం తన అధీనంలో ఉంచుకోవచ్చునునుకోవటం పొరపాటనేది తేలిపోయింది.

"రోజా! నేను మా ఊరు వెళ్ళిపోతున్నాను" అన్నాడు చలపతి ఒకనాడు.

"మళ్ళీ ఎప్పుడొస్తావ్?"

"రాను - ఎప్పటికీ రాను" అన్నాడు నిశ్చిత కంఠంతో.

తనకు భూమి గిర్రున తిరగటం కనిపించింది.

"అదేమిటీ - నన్ను వదిలి-"

"అది అంతే... నేను సంసారిని. నాకు కొన్ని బాధ్యతలున్నవి. స్వలాభమే చూసుకోవటం అన్యాయం."

"ఇన్నాళ్ళూ ఆ బాధ్యతలు లేవన్నమాట?" అంది తను ఒళ్ళుమండి.

"ఆ బాధ్యతల్ని నిర్వర్తించేందుకే ఇన్నాళ్ళూ నీ సహాయం అర్థించాను. ఈనాడు స్వతంత్రంగా ఏ చిన్న వ్యాపారమన్నా చేసుకొని సుఖంగా బతగ్గలను. నాలాగే నీవుకూడా నీ బాధ్యతల్ని...."

"ఈనాడు నీతులు చెప్పవొచ్చావా? నా బాధ్యతలు నాకు తెలుసు. నా నుంచి డబ్బు గుంజేందుకు సిగ్గులేకుండా ప్రవర్తించావ్... డబ్బుకు అమ్ముడయ్యావన్నమాట?" అంది తను వేదనతో.

"ఔను, డబ్బుకు నన్ను కొనుక్కోగలిగాననే సంగతి నీకూ తెలుసు. మన మధ్య ప్రణయం ఏనాడో మాయమైంది. ఒక రకం వ్యాపార నిబంధనే మనను కలిపింది. నన్ను డబ్బుకు అమ్ముడయ్యానని అన్నావే! నీవు నీ భర్త డబ్బుకు అమ్ముడవలా? అతను నిన్ను కొనుక్కోవటం నీ తప్పు కాదని అనగలుగుగాక! కాని, నీవు అమ్ముడవకుంటే అతను కొనుక్కోలేకపోయేవాడేకదా!"

అతని మాటల్లో సత్యం ఉన్నప్పటికీ, అవి తనకు రుచింపలేదు... నైచ్యానికి పై మెరుగులున్నంతసేపే ఆ "డీసెన్సి." వాటిని తొలగిస్తే పంచదార కోటింగ్ లేని క్వినైన్‌గా తయారవుతుంది. ఈ నీచ కార్యాల్లో అందరికీ భాగాలున్నప్పుడు, ఒకళ్ళను ఎత్తి

చూపటమంటే, తనను కూడా బైటకు నెట్టుకోవటమే అవుతుంది. నీ పక్కవాడి నైచ్యాన్ని నీవు భరించినంతసేపూ, నీ నైచ్యాన్ని కూడా వాడు భరిస్తాడు. నీవు తిరగబడితే, అతనూ తిరగబడతాడు... కనుక తెలివిగా వూరుకోవటమే అత్యుత్తమ మార్గం. తీగె కదుపుతే కంపంతా కదులుతుంది కదా!

జవాబు చెప్పేందుకు ఏమీలేక, తిరస్కారంగా, నిర్లక్ష్యంగా నవ్వి తను కోపంతో వెళ్ళిపోయింది. చేతికి దొరికింది పోయిన విచారం తనను కమ్మింది. కాని ప్రతి ఆనందానికి కొంత బాధ కూడా బై ప్రొడక్టల్లే వుంటుంది; కనుక తను భరించాల్సిందే! వేరొకమార్గం చూసుకునే వరకూ ఇది తప్పదనే సంగతి తెలిసికోగలిగింది తను!

**ఈమె :-**

కట్నంపోసి తనను వదిలించుకోలేని స్థితిలో చలపతి, కట్నం లేకుండానే తనను వివాహమాడేందుకు ఒప్పుకున్నప్పుడు, అదృష్టదేవత వరించినట్లే భావించింది. ఇంతకన్న మంచి సంబంధాన్ని కనీసం ఊహించలేదు కూడాను. డబ్బు ప్రస్తావన ఎప్పుడైతే లేదో ప్రణయం ఒక్కటే వివాహానికి పునాది అయినందుకు తను గర్వపడింది కూడాను.

చిన్న ఉద్యోగంతోనే ఎలాగో సంసార కాలక్షేపం చేయగలిగింది తను. ఇంతకన్న ఉన్నతస్థాయిలో జీవితాన్ని గడపాలని ఉన్నప్పటికీ తానందుకు విచారించలేదు. వేళకు ఇంత తిండీ, కట్టుకునేందుకు బట్టా, భర్త చల్లని చూపులే తనకు తృప్తిని ఇచ్చినవి.

ఆరేళ్లు యీ విధంగా గడిచినవి. సంసారంలోకి ముగ్గురు బిడ్డలు విచ్చేశారు. ప్రణయం సన్నగిలి, బాధ్యతలు పెరిగినవి. తెచ్చే జీతం ఏ మూలకు? మధుర ప్రణయమంతా విషతుల్యమైంది. మరీ ఆయన ఉద్యోగం వూడినప్పుడు, ఇక బతకటం ఎలాగో తనకు అర్థమవలేదు.

ఆయనా అనేక చోట్ల ప్రయత్నించే ఉండొచ్చు. అదంతా తనకు అనవసరం. ఆయన ఎలా సంపాయించినా తనకు లెక్కలేదు. సంసారం గడిస్తే చాలు. రోజు రోజుకూ కష్టాలు ఎక్కువైనవి. ఆయన శ్రమకు సానుభూతిచూపే ఓపికకూడా లేని పరిస్థితులు ఎదురైనవి. భార్య భర్త కష్టాల్ని పంచుకోవాలని తనకు తెలియకకాదు; కాని ఆ కష్టాలు ఇద్దరికీ భారమైనప్పుడు, మరెవరికి పంచాలి? ఇల్లు చూచుకోవటం తన వొంతైతే, సంపాయించటం ఆయన వొంతు. ఆయన బాధ్యతారహితంగా ప్రవర్తించటంతో, తనకు అసహ్యభావం కూడా రేకెత్తింది.

ఆయనకు విసుగెత్తి ఛస్తాననేవాడు: సన్యసిస్తాననేవాడు. తనకు ఛర్రుమని, ఏం చేసినా తనకు ఇంత ఆధారం చూపమనేది. ఆడకూతురు అంతకన్న ఏమంటుందీ? మరీ ఇంట్లోచారెడు గింజలుకూడా లేని పరిస్థితుల్లో, చిన్న పిల్ల చావుబతుకులమధ్య పోర్లాడే సమయంలో - ఆయన రెండురోజులపాటు ఇంటిమొహమే చూడకుంటే- తనకు ఎలా వుంటుందో అతను వూహించనైనా వూహించి ఉండడు.

ప్రణయాన్ని తలచుకొని, గాలి పీలుస్తూ బతకగల ననుకున్నాడేమో ఆయన! యీ అప్పులవాళ్ళందరినీ తనకు వొదిలి, యీ సంసార బంధాల్ని వొదిలించుకొనిపోతే సరిపోతుందనుకున్న పురుషునిపట్ల భార్యకు గౌరవం ఏమిటి? ఆ చంద్రమతి కథనూ, దమయంతి కథల్నే తలుచుకొని, భారతనారి బాధ్యతల్ని నూరిపోయటం తేలికేకాని, తీరా అలాటి పరిస్థితులొస్తే వాటిని భరించి ఎదుర్కోవటం తనలాటి సామాన్యురాలికి అతీతం గాక మరేమిటి? తను పుట్టింటికి వెళ్తాననేందుకు, అక్కడా తన కెవ్వరూలేరు! జీవితాన్ని భరిస్తానని బాసచేసిన నాధునికి లేని బాధ్యతలు యీ ప్రపంచంలో మరెవ్వరికి ఉంటవి.

ఆయన మీది ద్వేషం మిన్ను ముట్టింది. అంతా కలిసి గంగలో పడ్డా తనకు బాధ వుండేదికాదు. ఇంటికి వస్తే నాలుగూ కడిగి పారేసి, ఇల్లూ పిల్లలూ ఆయనకే వొదిలి ముందుగా తనుఛస్తే, అప్పుడు కాని తను పడే ఆవేదన తెలిసిరాదు. తను ఈ పనిని చేసే స్థితికి వెళ్ళిందనే ఆయన ఇంటికి రాలేదేమో?

చచ్చి నరకానికి వెళ్ళినా ఇంతకన్న సుఖంగా వుండేది. ముందు ఈ నరకం నుంచి తప్పించుకో గలుగుతే బాగుండును. తనచేత పిల్లల్ని కనిపించి, వాళ్ళను తన మెడకు ఉరితాళ్ళవలె తగిలించి, పరారవటం - పురుషత్వ మనిపించుకుంటే, తను అతన్ని అగౌరవించటం, తిరస్కారంగా మాట్లాడటం పాతివ్రత్యమే!

ఈ జీవితాన్ని మరి భరించలేక ఉరిపోసుకొని చద్దామనే ఊహ కలిగింది కాని, నాలుగు మాటలూ ఆయన్ను అడిగాకనే ఆ పని చేద్దామని వూరుకుంది. చివరకు కారు తన ఇంటి ముందు ఆగినప్పుడు - ఆయన దిగుతాడనుకోలేదు. ఆయన దిగగానే - ఏదో ఐశ్వర్యం వొచ్చి పడివుంటుందనే తలంపు రాగానే తను కొంతశాంతించిన మాట నిజం.

అంతే - ఆ రాత్రినుంచే మళ్ళీ దాంపత్య జీవితం రుచించసాగింది. భర్తమీద తనకు పోయిన అభిమానం, అనురాగం, గౌరవం అన్నీ ద్విగుణీకృతమైనవి. నిజమే - ఆయన బాధ్యతల్ని నిర్వర్తించుకో గలిగినప్పుడు, భార్యగా తనూ బాధ్యతా నిర్వహణను చేయగలగటంలో ఆశ్చర్యమేముందీ?

కొన్నాళ్ళవరకూ యీ సంపాదన గూర్చి తనకు తెలియదు; తెలుసుకోవాలని కూడా ఉండేదికాదు. కాని ఉత్తరోత్రా అనుమానంవేసి అడిగింది. బతిమాలి, భంగపడి చివరకు నిజమంతా లాగగలిగింది. అంతా తెలుసుకున్నప్పుడు “ఛీ!” అనిపించింది. చేయరాని పనులు చేసి నీచంగా ప్రవర్తించి సంపాయించిన యీ ధనం పట్ల తనకు గౌరవం లేదు. ఐతే ఇది లేనట్లయితే మళ్ళీ వొదిలిపోయిన నరకం తనను చుట్టుకుంటుందని తెలుసు. అందుకని చప్పున ఎటూ నిర్ధారణ చేసుకోలేక దీర్ఘాలోచనలో పడింది.

సూటి పోటీగా భర్తను ఆడిపోసి చూసింది. అతను వీటన్నిటికీ అతీతుడల్లే దులుపుకొని తిరిగేవాడు. డబ్బుకు మొహంవాచి ఉండటం వల్ల, ఆ డబ్బు దొరికేమార్గం చేజిక్కినప్పుడు నైచ్యమనేభావం లేకుండానే రెండుచేతులా సంపాయించాలనుకోవటం సహజమే.

కానీ యీ విధంగానా? తన హక్కుభుక్తమైన పవిత్ర ప్రణయాన్ని వెలగట్టి అమ్ముకునేటంత నీచానికి భర్త పాల్పడ్డాడనే తలంపు భరించరానిదైంది. ఎలాగైనా యీ ఉచ్చులోనుంచి బైట పడకుంటే తన సంసారం చితికిపోతుంది.

ఇందుకు తను వేసిన ఎత్తులు అనేకం. కన్నీళ్ళదగ్గర్నుంచి కారాలు మిరియాలు నూరటంవరకూ, ఎన్ని విధానాలున్నవో బీరుపోకుండా అన్నిటినీ అమలు జరిపింది. భర్త మనస్తత్వం ఏళ్ళతరబడిగా తనకు తెలుసు కనుక, అతన్ని కరిగించి తన కోర్కెలను సాధించుకోవటంలో యీసారి కూడా ఆమె శ్రమ వృథాకాలేదు.

అతను సరోజినితో అన్ని సంబంధాలూ శాశ్వతంగా వొదులుకొని అప్పటికి సంపాయించగలిగిన పదిహేనువేలతోనూ స్వగ్రామంలో వ్యాపారం చేసేందుకు అతన్ని ఒప్పించేటప్పటికి తన తలప్రాణం తోకకు వచ్చింది.

చివరకు రైల్లో కూర్చొని కిటికీలోంచి వొచ్చే చల్లగాలికి రేగే ముంగురుల్ని సరిజేసుకుంటూ జీవితం మధురమైనదనే వూహ తనకు కలగటంలో వింతేమిటి? తనతోపాటు – తన భర్త, పిల్లలూ, యీ ప్రపంచమే ఆనందంతో నాట్యం చేస్తున్నట్లు తను భావించ గలిగి, జీవితమే ధన్యమైన దనే వూహ మైమరిపించింది. న్యాయా న్యాయాల విచక్షణ, నీతి అవినీతి సారాంశాలనూ యీ సమాజానికీ, సమాజ సేవకులకూ వొదిలి, ఆ ఫలితాన్ని మాత్రమే స్వీకరించ గలిగిన మానవ మనస్తత్వానికి తను గర్వపడగలిగింది.

– అక్టోబర్, *1954*

> *ముగ్గురూ మూడు రకాల మనుష్యులు. దరిద్రంతో చావలేక, సముద్రంలో పడి చావలేక ఛస్తూన్న వాడికి, అకస్మాత్తుగా ఒక సుందరి సౌందర్య ధనం, ధనం దొరుకుతుంది. సౌందర్య ధనాన్ని, ధనాన్ని కొల్లగొంటాడతను.*
>
> *ఆమె : అంతన్నను! దరిద్రము ముసలితనమూ ముందున్నప్పుడు, డబ్బున్న ముసలితనం చేత పుస్తె కట్టించుకుని, దరిద్రంతో కుములుతూన్న పడుచుదనంచే శారీరకానందాన్ని పొందజూచిన వగలాడి.*
>
> *ఈమె : భర్త ప్రయోజకుడైన ఆనందంతో అసలు వ్యవహారం తెలిసీ తెలియనట్లు నటించి, సమయం కనిపెట్టి ఖళేరావ్ అన్నది.*